సాక్షి
జనగామ

శనివారం | 19 | ఆగస్టు | 2023



48వ వసంతంలోకి..

కాకతీయ యూనివర్సిటీ ఆవిర్భవించి 48 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా శనివారం కేయూ సెనెట్‌హాల్‌లో వేడుకలు నిర్వహించనున్నారు.

- 8లో▸



మహాలక్ష్మి ఎక్కడ?

గత నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదల్లో కొట్టుకుపోయిన భూపాలపల్లి మండలం మోరంచపల్లికి చెందిన మహాలక్ష్మి ఆచూకీ నేటికీ లభ్యం కాలేదు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై చిరు జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి.

న్యూస్‌రీల్

ఆరోగ్యశ్రీకి వన్నె తేవాలి



దేవరుప్పుల: వైద్యరంగంలో ఉన్న విస్తృత అనుభవంతో సీఎం కేసీఆర్ ఆశయాలను నెరవేర్చే దిశగా ఆరోగ్యశ్రీ శాఖకు వన్నె తేవాలని మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు.. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.సుధాకర్‌రావుకు సూచించారు. ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ స్టేట్ చైర్మన్‌గా నియమితులైన ఆయన శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రులను మర్యాద పూర్వంగా కలిశారు. రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లు వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఆకుల లలిత తదితరులు ఉన్నారు.

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



రఘునాథపల్లి: యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతోపాటు గొర్రెలు, కాపరులకు ఇన్సూరెన్స్ కల్పించాలని యాదవ సంఘం నేతలు మంత్రి శ్రీనివాస్‌యాదవ్‌ను కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలు వివరించారు. యాదవులకు ఎమ్మెల్యే స్థానాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సంఘం నాయకుడు వెంకటేష్‌యాదవ్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జాతీయ అధ్యక్షుడు మేకల రాములుయాదవ్, యూత్ అధ్యక్షుడు వంశీమోహన్, చిలుకల శ్రీనివాస్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: మెప్మా రిసోర్స్ పర్సన్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి సుంచు విజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ మేనేజర్ రాములుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. మెప్మా కార్యకర్తలకు వారంతపు సెలవుతోపాటు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని కోరారు. ఆర్పీలు ప్రశాంతి, వాసవి, సుమలత, రేణుక, సరిత, సంధ్య, మంజుల, పుష్ప పాల్గొన్నారు.

నేడు బహుమతుల ప్రదానం

జనగామ రూరల్: ప్రపంచ ఫొటోగ్రఫీ డేను పురస్కరించుకొని జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్, ఛాయాచిత్ర పోటీలు నిర్వహించారు. ఇందులో నర్మెట మండలం నుంచి క్రికెట్ చిత్రానికి మొదటి బహుమతి, పాలకుర్తి ద్వితీయ, ఛాయాచిత్రంలో మొదటి బహుమతి రచ్చ మోహన్ జనగామ, రెండో బహుమతి మడికంటి రమేష్ రఘునాథపల్లి, మూడవ బహుమతి అంజి నర్మెట మండలం నుంచి ఎంపికయ్యారు. వీరికి శనివారం పట్టణంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు జిల్లా అధ్యక్షుడు చంద్రప్రకాష్ శుక్రవారం జరిగిన సమావేశంలో తెలిపారు. రాము, శ్రీనివాస్, ప్రవీన్, వేణు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం..

రఘునాథపల్లి: మోడల్ స్కూళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించని పక్షంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ సమర భేరి సైకిల్ యాత్ర బృందం శుక్రవారం వెల్ది మోడల్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థినుల సమస్యలు తెలుసుకున్నారు. సందీప్, లవకుమార్, యాకన్న, రంజిత్, మోహన్, సందీప్, గోపి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ చిత్రం వీక్షణ

జనగామ: భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు వేడుకలను పురస్కరించుకుని జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తిలో శుక్రవారం విద్యార్థులు గాంధీ చిత్రం తిలకించారు. మొత్తం 2,490 మంది పిల్లలు చిత్రం చూడగా డీఈఓ రాము, డీపీఆర్ఓ రాజేంద్రప్రసాద్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

కేంద్ర బృందం పరిశీలన



దేవరుప్పుల : కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన స్వచ్ఛభారత్ సంక్షేమ అభివృద్ధి పనులను పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర బృందం ప్రతినిధి వేణు ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంతోపాటు చౌడూరులో పర్యటించింది. పాఠశాలు, సామూహిక మరుగుదొడ్ల వినియోగం, ఇంకుడు గుంతలు, తడి పొడిచెత్త సేకరణ కేంద్రాల పనితీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వారి వెంట స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా అధికారి కరుణాకర్, ఎంపీడీఓ సురేష్‌కుమార్, సర్పంచ్‌లు ఈదునూరి రమాదేవి నర్సింహారెడ్డి, ఇనుముల ప్రమీల రంగయ్య, ఈజీఎస్ ఏపీఓ శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అంచనాలకు మించి..

మద్యం దరఖాస్తులు 2,355

- కొనసాగుతున్న పరిశీలన
- మరో 30 పెరిగే అవకాశం
- లిక్కర్ బిజినెస్‌కు కొత్త ముఖాలు
- నిరుద్యోగులు, వ్యాపారులు, మిల్లర్లు

లిక్కర్ బిజినెస్ జూదంలా మారింది. లక్కు తగిలితే రూ.కోటి.. లేదంటే రూ.రెండు లక్షలే కదా అని సింపుల్‌గా తీసేస్తున్నారు. ఆశ.. అత్యాశకు పోయి.. అప్పులు చేసి మరీ టెండర్లు వేస్తున్నారు. మిలర్లు, మధ్య తరగతి వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, నిరుద్యోగులు, పలువురు ఉద్యోగులు(ఇతరుల పేరిట), రియల్టర్లు ఈసారి వైన్స్ షాపులపై కన్నేశారు. దీంతో ఎక్సైజ్ శాఖ అంచనాలకు మించి ఒక్కో షాపునకు సగటున 53 దరఖాస్తులు వచ్చాయంటే ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు.

\- జనగామ



మద్యం దుకాణాలకు టెండర్లు వేసేందుకు క్యూలో నిలబడిన దరఖాస్తుదారులు

జిల్లాలో మద్యం దుకాణాల టెండర్లు రికార్డు సృష్టిస్తున్నాయి. 12 మండలాల పరిధిలో 47 మద్యం దుకాణాలు ఉన్నాయి. 2023–25 సంవత్సరానికి గాను ఎక్సైజ్ శాఖ ఈనెల 4 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించగా.. టెండర్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. మొదటి వారం రోజులు పెద్దగా స్పందన లేకపోడంతో ఆందోళనకు గురైన ఎక్సైజ్ శాఖ అధికారులు ఎలాగైనా టార్గెట్ రీచ్ కావాలనే పట్టుదలతో ప్రచారం చేశారు. రియల్టర్లు, వ్యాపారులు, సంపన్నుల వద్దకు వెళ్లి.. మద్యం దుకాణాల నిర్వహణలో వచ్చే లాభాల గురించి వివరించినట్లు ప్రచారం జరిగింది. ఫలితంగా ఆశించిన దానికంటే అధికంగా దరఖాస్తులు వచ్చాయి.

2,355 దరఖాస్తులు

జిల్లాలో 2023–25 సంవత్సరానికి గాను శుక్రవారం రాత్రి 11.30 గంటల సమయం వరకు 2,355 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా జనగామ పరిధిలో 313, రఘునాథపల్లి 222, పాలకుర్తి 319, జఫర్‌గఢ్‌లో 184 ఉన్నాయి. హైదరాబాద్, వరంగల్ కమిషనర్ కార్యాలయాల్లో వేసిన టెండర్లతో మరో 30 పెరిగే అవకాశం ఉంది. దీంతో చలాన్ల పేరిట ప్రభుత్వానికి రూ.47 కోట్ల మేరకు ఆదాయం సమకూరింది.

ఆశ.. అత్యాశ

మద్యం దుకాణాల టెండర్లకు అనూహ్యంగా పెరిగిన దరఖాస్తుల విషయం చర్చకు దారితీసింది. ఓ వైపు రాజకీయ పార్టీల టికెట్ల లొల్లి నడుస్తుండగా..

రికార్డులు బ్రేక్

జిల్లాలో మద్యం దుకాణాల టెండర్ల రికార్డు బ్రేక్ అయింది. 2017–19 సంవత్సరం 1,342, 2021–23లో 1,512 దరఖాస్తులు రాగా.. నాలుగేళ్లకు కలిపి చలాన్‌ల రూపంలో సుమారు రూ.57 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. ఈసారి ఒక్క రెండేళ్ల కాలపరిమితికే 2,355 దరఖాస్తులతో రూ.47కోట్లు దాటిపోవడం గమనార్హం. జిల్లాలో ఒక్కో దుకాణానికి 20 టెండర్లు వస్తాయని ఎక్సైజ్ శాఖ అనుకోగా.. సగటున 53 దరఖాస్తులకు పైగా రావడంతో అధికారుల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ప్రవీణ్, సీఐలతో కలిసి జిల్లా అధికారి కృష్ణప్రియ టెండర్ల ప్రక్రియను పరిశీలించారు.

మరోవైపు వైన్స్ టెండర్ల ప్రక్రియ హాట్‌టాపిక్‌గా మారింది. పలువురు ఉద్యోగులు బినామీల పేరిట మద్యం దుకాణాల టెండర్లు వేయగా.. కొంతమంది నిరుద్యోగులు కూడా గ్రూపులుగా జతకట్టారు. ఇలా వందకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. సుమారు ఆరు బిగ్ సిండికేట్ గ్రూపులు 1,100లకు పైగా టెండర్లు దాఖలు చేశారు. ఇప్పటి వరకు లిక్కర్ వ్యాపారంతో సంబంధం లేని సుమారు 600 మందికి పైగా టెండర్లు వేసినట్లు తెలుస్తున్నది. 2021–23 మద్యం టెండర్ల సమయంలో మొదటిసారి టెండర్లు వేయగా.. లక్కు కలిసి రావడంతో.. రూ.70లక్షల నుంచి రూ.కోటి వరకు అమ్ముకున్న విషయం తెలిసిందే. ఈసారి రూ.2లక్షల చలాన్‌కు అదృష్టం వరిస్తే రూ.కోటి వస్తుందనే ఆశతో చాలా మంది అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని ఒక్కొక్కరు పదికి తక్కువ కాకుండా టెండర్లు వేసినట్లు చర్చ జరుగుతోంది.

జిల్లాలో మద్యం టెండర్ల వివరాలు

ప్రాంతం	షాపులు	దరఖాస్తులు
జనగామ	10	313
పెంబర్తి	01	59
లింగాలఘణపురం (నెల్లుట్ల)	03	162
నర్మెట	02	88
బచ్చన్నపేట	03	162
చిన్నపెండ్యాల	01	126
కరుణాపురం	01	99
స్టేషన్‌ఘన్‌పూర్	04	140
శివునిపల్లి	02	86
తరిగొప్పుల	02	66
రఘునాథపల్లి	03	222
ఛాగల్	01	24
నిడిగొండ	01	36
పాలకుర్తి	04	319
మొండ్రాయి	01	30
కొడకండ్ల	02	56
జఫర్‌గఢ్	03	184
దేవరుప్పుల	03	183
మొత్తం	47	2,355

సజావుగా టెండర్ల ప్రక్రియ



“జిల్లాలో 15 రోజుల పాటు మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ సజావుగా జరిగింది. అనుకున్న దానికంటే ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 47 మద్యం దుకాణాలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేశాం. ఎక్కడా చిన్న పొరపాటు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. దరఖాస్తులకు సంబంధించి నివేదికను కలెక్టర్‌కు అందించాం.

\- కృష్ణప్రియ, జిల్లా ఎక్సైజ్ అధికారి



పట్టణంలో సంతోషిమాత ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

శ్రావణ సందడి

జనగామ: సకల శుభాలను ఒసగే.. శ్రావణ మాసం మొదటి శుక్రవారం జిల్లాలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు వరలక్ష్మీ అమ్మవారిని పూజించారు. బుగులు శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి, కొడవటూరు సిద్ధేశ్వరస్వామి, జీడికల్ శ్రీ సీతారామచంద్రస్వామి తదితర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జనగామ పట్టణంలోని శ్రీ సంతోషిమాత, శ్రీ చెన్నకేశవ, శ్రీ సరస్వతీ మాత, పాత బీటుబజారు శ్రీ రామలింగేశ్వర స్వామి, బాణాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి, గణేష్ స్ట్రీట్ అంజనేయస్వామి, గీతానగర్ శివాలయం, శ్రీ సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక వ్రతాలు, అర్చనలు, కుంకుమ పూజలు, అభిషేకాలు జరిగాయి.



అలంకరణలో అమ్మవారు

పోరాట యోధుడు సర్వాయి పాపన్న



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్



నివాళులర్పిస్తున్న కుమార్‌గౌడ్, తదితరులు

- ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుహాసిని

జనగామ రూరల్: బహుజన పోరాట యోధుడు సర్వాయి పాపన్న అని ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుహాసిని అన్నారు. శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బీసీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పాపన్న ఘనతను, పోరాట పటిమను నేటి తరానికి తెలియజేయాలన్నారు. మత విద్వేషాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడి చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి బి.రవీందర్, జిల్లా అధికారులు, వివిధ గౌడ సంఘాల నాయకులు వెంకట మల్లయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

రఘునాథపల్లి: సర్వాయి పాపన్న స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వై.కుమార్ గౌడ్ అన్నారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్యాంక్ బండ్‌పై పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. వెల్ది సర్పంచ్ కొయ్యడ మల్లేష్, నామాల బుచ్చయ్యగౌడ్, మల్కపురం లక్ష్మయ్యగౌడ్, కోళ్ల రవిగౌడ్, యాకస్వామి, బండి కుమార్, శంకరి శ్రీనివాస్, శ్రీకాంత్, రంగు రాజు, దుబ్బాక హరీష్, కోళ్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కమిటీ

జనగామ: పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు కమిటీ ప్రతినిధులు ఎన్పీడీసీఎల్ ఎస్.వేణుమాధవ్‌ను శుక్రవారం కలిశారు. ఆగస్టు 15న ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రం అందుకున్న ఎస్ఈని వారు సత్కరించారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కనకయ్య, వంశీకృష్ణ, డివిజన్ సెక్రెటరీ మనోహర్, నిఖిల్‌రెడ్డి, శ్రీధర్, రమేష్, నితిన్‌రెడ్డి, నరసింహారెడ్డి, హరీష్, సుజాత, రఘూన్సీ, కృపారాణి ఉన్నారు.



ఎస్ఈని సత్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

విద్యారంగ అభివృద్ధికి పాటుపడాలి

- జిల్లాలో స్టడీ సర్కిళ్లు, పాలిటెక్నిక్, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలి
- విద్యార్థి యువ గర్జనలో వక్తల డిమాండ్



అభివాదం చేస్తున్న విద్యార్థి, జాక్ నాయకులు

జనగామ రూరల్: పోరాడి సాధించుకున్న జనగామ జిల్లాలో విద్యరంగ అభివృద్ధికి పాటుపడాలి.. స్టడీ సర్కిళ్లు, పాలిటెక్నిక్, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలని జనగామ జాక్ నాయకుడు చక్రధర్, మాచర్ల భిక్షపతి అన్నారు. శుక్రవారం జాక్ నాయకుడు మంగళంపల్లి రాజు, పిట్టల సురేష్ ఆధ్యక్షతన స్థానిక ప్రెస్టెన్ కళాశాల ఆవరణలో నిర్వహించిన ‘విద్యార్థి యువ గర్జన’ సభలో మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న జిల్లాలో.. యువకులు, విద్యార్థులు నేటికీ కేసులతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేసులు తొలగించడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ స్టడీ సెంటర్లు ఏర్పాటు చేయకపోవడం విద్యార్థులపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు. ఓట్లు సీట్ల కోసమే కేసీఆర్ పాకులాడుతున్నారని ధ్వజమెత్తారు. మెడికల్ కళాశాల జాక్ పోరాట ఫలితే అని, పాలిటెక్నిక్, నర్సింగ్ కళాశాలలు తీసుకురావడంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి విఫలమయ్యారని అన్నారు. ఆయనకు వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇస్తే 100 మంది ఉద్యమకారులతో పోటి చేసి ఓడిస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి విద్యను ప్రైవేట్ పరం చేస్తున్నారని, ఆయన కూడా జనగామలో పోటీ చేయడానికి వీలు లేదన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి పాటు పడేలా సీఎం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేయూ, ఓయూ జాక్ నాయకులు తిరుపతి, సంతోష్, సాధిక్ అలీ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రమాణ స్వీకారం

- భారీ ఏర్పాట్లు చేసిన పార్టీ శ్రేణులు

జనగామ: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన తర్వాత మొదటిసారి శనివారం(నేడు) జిల్లాకు వస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 9 గంటలకు కొమురవెల్లి పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ర్యాలీగా చేర్యాల, అక్కడి నుంచి బచ్చన్నపేట మీదుగా జనగామ మండలం పసరమడ్ల స్టేజీకి చేరుకుంటారు. జనగామలోని పార్టీ జిల్లా కార్యాలయం నూతన ఆఫీసును ప్రారంభించిన అనంతరం సూర్యాపేట రోడ్డులోని భ్రమరాంబ ఫంక్షన్ హాల్‌కు చేరుకున్న తర్వాత జిల్లా అధ్యక్షుడిగా కొమ్మూరి ప్రమాణ స్వీకారం చేస్తారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులంతా తరలి రావాలని పార్టీ ప్రతినిధులు కోరారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా..

- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: అధికార పార్టీ ఎమ్మెల్యే అంటే అభివృద్ధి బ్రహ్మాండంగా జరగాలి.. అయితే అనుకున్న స్థాయిలో జరగలేదు.. తనకు అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి తోటలో పార్టీ ఘన్‌పూర్ గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా బీజేపీ, కాంగ్రెస్ తదితర పార్టీల నుంచి పలువురు కడియం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం శ్రీహరి మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా నియోజకవర్గ ప్రజలతో మమేకమై అభివృద్ధిలో పాలుపంచుకున్నాను.. ఏనాడు తప్పుడు పనులు చేయలేదు.. ప్రజలకు తలవంపులు తేలేదని కడియం అన్నారు. పేదరికం నుంచి వచ్చిన తనకు వారి కష్టాలు తెలుసుని, పార్టీ పదవులు, ప్రభుత్వ పథకాల ఆశచూపి ఎవరి వద్దా ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని చెప్పారు. పక్కనే ఉన్న పాలకుర్తి, వర్ధన్నపేట బాగా అభివృద్ధి చెందాయని, తనను ఆశీర్వదించి అవకాశం ఇస్తే స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్లు కలిపి మున్సిపాలిటీ చేయించి అభివృద్ధి చేస్తానన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్నగుప్తా, నీల గట్టయ్య, పోగుల సారంగపాణి, పురమాని రజాక్‌యాదవ్, గన్ను నర్సింహులు, తెల్లాకుల రామక్రిష్ణ,సింగపురం జగన్, రాజేష్‌నాయక్, డాక్టర్ జైహింద్‌రాజ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పింఛన్ బదిలీలు చేపట్టాలి

వీసీలో సీఎస్ శాంతికుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ శివలింగయ్య, అధికారులు

జనగామ: రాష్ట్రంలో ఆసరా పింఛన్(వృద్ధాప్య)దారులు మరణించిన పక్షం రోజుల్లో భాగస్వామికి పెన్షన్ బదిలీ ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ పథకాలపై సమీక్షించారు. ఈనెల 26 నాటికి హరితహారం కింద కోటి మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని, గొర్రెల పంపిణీ లక్ష్యాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని చెప్పారు. బీసీ, మైనార్టీ కులవృత్తులకు రూ.లక్ష ఆర్థిక సహాయం మొదటి దశ పంపిణీ త్వరగా చేపట్టాలని ఆదేశించారు. గృహలక్ష్మి స్కీంలో అర్హుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని, సోషల్ వెల్ఫేర్ పరిధిలో ఇంటి పట్టాల పంపిణీ పూర్తి చేయాలన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ ప్రక్రియకు సంబంధించి జిల్లా కమిటీ స్క్రుటినీ చేసి పత్రాలను సెప్టెంబర్ 15 నాటికి అందజేయాలని చెప్పారు. 58 జీఓ కింద వచ్చిన దరఖాస్తుల్లో అర్హులకు పట్టాల పంపిణీ చేసి.. నోటరీ భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తుల ధ్రువీకరణ ఎప్పటికప్పుడు చేపట్టాలని తెలిపారు. 61 ఏళ్లు నిండిన వీఆర్ఏ వారసులకు ఉద్యోగ కల్పన ప్రక్రియ చేపట్టాలని సూచించారు.



ఘరానా చీటింగ్

- రూ.2 కోట్లతో ఉడాయించిన చీటీ వ్యాపారి
- లబోదిబోమంటున్న బాధితులు

నల్లబెల్లి: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో ఓ వ్యక్తి అనధికారికంగా చీటి దందా నిర్వహించాడు. పదేళ్లుగా చిట్టీల నిర్వహిస్తుండడంతో నమ్మకంతో మండలంలోని పలువురు సభ్యులుగా చేరారు. వారి నుంచి డబ్బులు వసూలు చేసి రూ.5లక్షలు, రూ.2లక్షలు, రూ.1లక్ష, రూ.50వేల చీటీలు నిర్వహించాడు. ఒక్కొరి దగ్గర రూ.2 వేల నుంచి రూ.12,500 వరకు ప్రతి నెలా క్రమం తప్పకుండా వసూలు చేశాడు. కొన్నాళ్లు నమ్మకంగా చెల్లిస్తూ వచ్చాడు. చీటి తీసుకున్న వారి నుంచి కూడా డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీసుకున్నవారికి వడ్డీ చెల్లిస్తామని నమ్మించాడు. గత ఐదారు నెలలుగా వసూలు చేసిన చీటి డబ్బులు గడువు తీరిన వారికి చెల్లించకుండా జాప్యం చేశాడు. ఇలా సుమారు రూ.2కోట్ల వరకు డబ్బులు జమ చేశాడు. సభ్యుల నుంచి డబ్బులు చెల్లించాలని ఒత్తిళ్లు వచ్చే అవకాశం ఉందని భావించి, ముందస్తు ప్రణాళికతో తన ఇంటిపై రూ.14 లక్షల బ్యాంకు రుణం తీసుకున్నారు. 25 తులాల బంగారు ఆభరణాలపై బ్యాంకులో తీసుకున్న రుణాన్ని చెల్లించి బంగారం విడిపించుకున్నాడు. మరో 10 తులాల బంగారు ఆభరణాలను కొనుగోలు చేశాడు. 10 గుంటల భూమిని విక్రయించి సొమ్ముచేసుకున్నాడు. బాధితులు తనకున్న కొద్దిపాటి ఆస్తిని సైతం జప్తు చేసుకునేందుకు అవకాశం ఇవ్వకుండా పక్కా ప్రణాళికతో ఇటీవల కుటుంబ సభ్యులతో కలిసి రాత్రికి రాత్రే ఉడాయించాడు. విషయం తెలుసుకున్న బాధితులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది నగదు రూపంలో ఇవ్వగా, మరికొంతమంది ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరిపినట్లు చెబుతున్నారు. తనను ఇబ్బందులకు గురిచేస్తే కోర్టు నుంచి ఐపీ తెచ్చుకుంటానని సదరు నిర్వాహకుడు చెబుతున్నాడని కొంతమంది బాధితులు పేర్కొంటున్నారు. అయితే ఈ విషయంలో బాధితులు ఎవ్వరు ముందుకు రాకపోవడం విడ్డూరం.

అనుమతి లేకుంటే చర్యలు

గ్రామాల్లో అనుమతి లేకుండా చీటీలు నిర్వహించొద్దు. అనుమలు లేనివావద్ద ప్రజలు చీటీలు వేయకూడదు. ఇప్పటి వరకు బాధితులు ఎవరు ఫిర్యాదు చేయలేదు. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

- నైనాల నగేష్, ఎస్సై, నల్లబెల్లి



48వ వసంతంలోకి..

అర్ధశతాబ్దానికి చేరువలో కాకతీయ యూనివర్సిటీ

- న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్‌తో జోష్
- వేధిస్తున్న అధ్యాపకుల కొరత
- నేడు కేయూ ఆవిర్భావ దినోత్సవం


తాటికొండ రమేష్, వీసీ


కేయూ పరిపాలనభవనం

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఉస్మానియా విశ్వ విద్యాలయం తర్వాత అంతటి ప్రతిష్ట కలిగినది కాకతీయ యూనివర్సిటీ.. ఉస్మానియా యూనివర్సిటీ పీజీ సెంటర్‌గా ప్రారంభమై 1976 ఆగస్టు 19న కాకతీయ యూనివర్సిటీగా ఆవిర్భవించిన కేయూ.. నేటితో 48వ వసంతంలోకి అడుగిడుతోన్న సందర్భంగా ప్రత్యేక కథనం.

- నాలుగు విభాగాల పీజీ కోర్సులతో ప్రారంభమైన కేయూ ప్రస్తుతం 28 విభాగాలతో కొనసాగుతుంది. కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్, కరీంనగర్ జిల్లాలు ఉండగా శాతవాహన యూనివర్సిటీ ఏర్పాటు తర్వాత మూడు ఉమ్మడి జిల్లాలతో కొనసాగుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్, అటానమస్ డిగ్రీ కళాశాలలు 287వరకు ఉండగా పీజీ కళాశాలలు 74, ఇంజనీరింగ్ 6, ఫార్మసీ 25, ఎడ్యూకేషన్ 41, ఫిజికల్ ఎడ్యూకేషన్ 3, లా కళాశాలు 3, ఎంబీఏ 24, ఎంసీఏ 7, హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలు 3 ఉన్నాయి.
- యూనివర్సిటీలో అన్ని విభాగాలు కలిపి 409 అధ్యాపకుల (అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ల) పోస్టుల మంజూరు ఉండగా ప్రస్తుతం 86 మంది అధ్యాపకులే ఉన్నారు.
- రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీకి 136 పోస్టులు మంజూరు చేసినా ఇప్పటివరకు నియమించలేదు.
- యూనివర్సిటీలో సుమారు 180వరకు కాంట్రాక్టు లెక్చరర్లు, 200లకుపైగా పార్ట్‌టైం లెక్చరర్లు పనిచేస్తున్నారు.
- యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేశారు.
- వీసీ రమేష్ తన ఇష్టారాజ్యంగా పాలన కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- కేయూలో రెండు మూడు పరిపాలనా పదవులను ఒకరే నిర్వర్తిస్తున్నారు.
- ఉద్యోగుల సమస్యలపై ఆందోళనలు చేస్తే షోకాజ్ నోటీసులు, బదిలీలు చేస్తుండడం వివాదాలకు తావిస్తుంది.
- యూనివర్సిటీలో వివిధ కోర్సుల్లో భారీగా ఫీజుల పెంపుపై విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నేడు న్యాక్ సక్సెస్ మీట్

నేడు యూనివర్సిటీ 48 ఆవిర్భావ దినోత్సవ వేడుకలతోపాటు, న్యాక్ ఏ ప్లస్ సాధించిన నేపథ్యంలో సక్సెస్ సెలబ్రేషన్స్‌ను నిర్వహించనున్నారు. తెలిసింది. ఉదయం 11 గంటలకు కేయూ సెనెట్‌హాల్‌లో జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య తాటికొండ రమేష్, ఉపన్యాసకులుగా న్యాక్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్ పాల్గొంటారు.

- యూనివర్సిటీ భూమిలోనే ఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఇళ్లతోపాటు మరోఇద్దరు ఉద్యోగుల ఇళ్లు కలిసి 13మందివి ఉన్నా.. వారిపై చర్యలు తీసుకోలేకపోతున్నారు.
- న్యాక్ కోసం క్యాంపస్‌లో రూ.10 కోట్ల వ్యయంతో అభివృద్ధి, మరమ్మతులు, సుందరీకరణ పనులు చేశారు. ఇటీవల కేయూ న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించింది.
- యూనివర్సిటీలో కే హబ్, మహిళలకు మరో వసతి గృహం నిర్మాణాలు పూర్తికావచ్చాయి.

పాపన్న స్ఫూర్తితో గీత కార్మికుల అభివృద్ధి

- రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు


వేడుకలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో గీత కార్మికుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గౌడ సంఘాల ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు శుక్రవారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనం ఎదుట నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, మాట్లాడారు. సామాన్య గీత కార్మిక కుటుంబంలో జన్మించిన సర్వాయి పాపన్న మొఘల్ సామ్రాజ్యాన్ని గడగడలాడించాడని గుర్తు చేశారు. సర్వాయి పాపన్న స్ఫూర్తితో గీత కార్మికుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. మద్యం దుకాణాల టెండర్లలోనూ గీత కార్మికులకు ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించిందని తెలిపారు. చెట్ల పన్ను రద్దు చేసి వారి అభ్యున్నతికి కేసీఆర్ పాటుపడుతున్నారని పేర్కొన్నారు. సుమారు రూ.8 కోట్లతో హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో నీరా కేఫ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరబాబు, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్, నాయకులు శామకూరి ఐలయ్య, రాయిపెల్లి యాకయ్య, తాళ్లపల్లి రమేష్, హేమాద్రి, దూలం శ్రీనివాస్, నాగపురి అశోక్ పాల్గొన్నారు.

ముగిసిన మార్కెట్ సెక్రటరీల టూర్

వరంగల్: కేంద్ర మార్కెటింగ్‌శాఖలోని 130వ బ్యాచ్‌కు చెందిన ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన మార్కెటింగ్ శాఖ అధికారులు, కార్యదర్శులు రెండు రోజుల స్టడీటూర్, శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏనుమాముల మార్కెట్‌లోని మిర్చి, పత్తి, పసుపు–పల్లికాయ, ధాన్యం–అపరాల యార్డుల్లో జరిగిన క్రయ, విక్రయాలను పరిశీలించారు. అనంతరం మన అగ్రిటెక్‌ను చైర్‌పర్సన్ దిడ్డిభాగ్యలక్ష్మితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లోని పాలనా వ్యవహారాలను ఉన్నత శ్రేణి కార్యదర్శి బీవీ.రాహుల్ వారికి వివరించారు. కార్యక్రమంలో జేడీఎం మల్లేషం, డీడీఎం అజ్మీరా రాజు, డీఎంఓ ప్రసాద్ రావు, డీఎంఐకి చెందిన సీనియర్ మార్కెటింగ్ ఆఫీసర్ ఫణిరాజశేఖర్, మార్కెటింగ్ అధికారి రాఘవేంద్ర, కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, గ్రేడ్–2 కార్యదర్శులు బియాబాని, రాము, మార్కెట్ అధికారులు రాజ్‌కుమార్, కృష్ణమీనన్, వెంకన్న, మురళి, శివకుమార్, గంగాధర్, రమణ, స్వప్న పాల్గొన్నారు.

'సాక్షి' ఫొటోగ్రాఫర్‌కు అవార్డు


గోవర్ధనం వేణుగోపాల్


బహుమతికి ఎంపికైన ఫొటో

ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని తెలంగాణ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించారు. ఈ మేరకు రవీంద్రభారతిలో మూడు విభాగాలుగా నిర్వహించిన పోటీల్లో శుక్రవారం విజేతలను ప్రకటించారు. ఇందులో జనగామ జిల్లా సాక్షి దినపత్రిక ఫొటోగ్రాఫర్ గోవర్ధనం వేణుగోపాల్ కేటగిరీ–3లో కన్సోలేషన్ బహుమతికి ఎంపికయ్యారు. కాగా, ఈ నెల 20వ తేదీన ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్ రావు బహుమతి ప్రదానం చేయనున్నారు.

- జనగామ

క్రమశిక్షణతో అత్యుత్తమ ఫలితాలు

- ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి


మాట్లాడుతున్న ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి

హసన్‌పర్తి: క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర పఠనం ద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి అన్నారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బీ.టెక్‌లో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందిన విద్యార్థినులకు శుక్రవారం ఒరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సమావేశానికి వరదారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధ్యాపకులే కాకుండా తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై నిరంతంరం పర్యవేక్షణ ఉంచాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన విద్యనందించడంలో సుమతిరెడ్డి కళాశాల ముందు వరుసలో ఉందన్నారు. విద్యార్థినులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తూ వారిలో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాలు వెలికి తీస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాలకు వివిధ కంపెనీలను ఆహ్వానించి క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థిని ఉద్యోగం పొందేలా బోధన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సుదర్శన్, డాక్టర్ మహేందర్, ఏఓ వేణుగోపాలస్వామి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఎక్కడ..?

- మోరంచపల్లి వరదలో కొట్టుకుపోయిన మహిళ
- నేటికీ లభ్యంకాని ఆచూకీ
- ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు


మహాలక్ష్మి(ఫైల్)


ఇంటి ఎదుట దీనస్థితిలో మహాలక్ష్మి భర్త శ్రీనివాస్

భూపాలపల్లి అర్బన్: జూలై 27వ తేదీన కురిసిన భారీ వర్షాల కారణంగా భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి గ్రామాన్ని వరద ప్రవాహం ముంచెత్తిన విషయం తెలిసిందే. ఈ వరద ఉధృతిలో గ్రామానికి చెందిన నలుగురు కొట్టుకుపోయారు. వీరిలో ముగ్గురి మృతదేహాలు లభ్యం కాగా.. గడ్డం మహాలక్ష్మి ఆచూకీ నేటికీ లభ్యంకాలేదు. 22 రోజులుగా పోలీసులు సైతం గాలింపు చర్యలు చేపడుతున్నారు. అయితే వరద ప్రవాహంలో కొట్టుకుపోవడంతో ఇప్పటికే మహాలక్ష్మి మృతిచెంది ఉంటుందని కుటుంబ సభ్యులు సైతం భావిస్తున్నారు. కానీ, కనీసం మృతదేహం ఆనవాలైన కపిస్తుందని ఎదురు చూస్తునారు. మహాలక్ష్మి ఇద్దరు కుమార్తెలు తల్లి గల్లంతు నాటినుంచి తండ్రి శ్రీనివాస్‌కు ధైర్యం చెబుతూ తనవద్దనే ఉంటున్నారు. రెండు వారాల క్రితం మొగుళ్లపల్లి మండలంలో చలివాగు పరివాహక ప్రాంతం, మూడు రోజుల క్రితం ఏటూరునాగారం గోదావరి పరివాహక ప్రాంతంలో రెండు మృతదేహాలు కన్పించాయి. అందులో మహాలక్ష్మి ఆనవాళ్లు లేకపోవడతో కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందని ఎక్స్‌గ్రేషియా..

వరదలో కొట్టుపోయి చనిపోయిన పేరుతో ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అయితే మృతదేహాలు దొరికిన వారికి మాత్రమే ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నారు. అయితే మహాలక్ష్మి ఆచూకి ఇంకా లభ్యం కాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు, ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎక్స్‌గ్రేసియో ఇవ్వాలంటే తప్పనిసరిగా పోస్టుమార్టం రిపోర్టు ఉండాలని అధికారులు చెబుతున్నారు. మహాలక్ష్మి ఇంకా చనిపోయినట్లు నిర్ధారణ కాకపోవడంతో పోస్టుమార్టం రిపోర్ట్ రావడం కష్టం. దీంతో అధికారులు ప్రభుత్వానికి ఎటువంటి నివేదికను పంపించలేదని తెలిసింది.

మిస్సింగ్ కేసు నమోదు చేశాం

మహాలక్ష్మి ఆచూకి కోసం మూడు మండలాల పరిధిలోని వాగులు, చెరువుల వెంట గాలింపు చర్యలు చేపడుతున్నాం. ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాలేదు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేశాం. ఆరు నెలల వరకు వేసి చూసి కేసు కొట్టివేస్తాం. ఎక్కడైనా మృతదేహాలు కనిపిస్తే వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇస్తున్నాం. వారు కుడా పరిశీలిస్తున్నారు.

- రాంనర్సింహారెడ్డి, సీఐ భూపాలపల్లి

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ మన వరంగల్‌లోని శంభునిపేట సమీపంలో నాయుడు పెట్రోల్ పంపు, వినాయకనగర్‌లో 100 గజాల Open Plot కలదు. సంప్ర॥ సెల్: 9849063958. [W-189138]

■ వరంగల్ జాన్ పీరీలు రైల్వే గేట్ ప్రక్కన్న 109 గజాల ఉత్తరం ఫేస్ గల Open Plot అమ్మబడును వివరాలకు సంప్ర॥ సెల్: 9849459661. [W-189137]

■ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బెంగుళూరు హైవే తిమ్మాపూర్, కొత్తూరు, నందిగామ ఇళ్ళ మధ్యలో HMDA వెంచర్‌లో కే॥ 15 లక్షలకే ప్లాట్ సొంతం. లోన్ సౌకర్యం కలదు.(ఏజెంట్లు కావలెను) 9052254789. [HA-788519]

HOUSE FOR SALE

■ ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్లు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన బట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent House అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27210]

■ మామునూర్‌లోని ఎత్తైన జాగాలో South / East కార్నర్ 390 చ॥గజాల్లో 1560 Sft నిర్మిత ఇంటికై సంప్రదించండి: సెల్: 9032111600. [W-785647]

FLATS FOR SALE

■ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డు, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27213]

SERVICES

■ హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్-WGL 9618767116 [W-189122]

■ మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలలో గాని తాకట్టులో వున్న మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును 100% స్పాట్ క్యాష్ ✆ 8897552200 [T-142]

WANTED

■ Sales Representative: Preferred qualification.1)Solid Education Background (Bachelor's Degree preferred. 2) Fluent in English, Telugu and Hindi, 3) Ability to Travel as required please send your resume to mail. info@primetextiles.in. or Whatsapp: 9849268123, Last Date to apply 23.8.2023. Interview follows for impressive profiles. [WA-980]

■ WGL, Experienced కార్ టెక్నీషియన్స్, హెల్పర్స్ కావలెను. సాలరీ: 20,000/- మా మోటార్స్ ములుగు X రోడ్ వరంగల్, సెల్: 9948434745, 9000687574. [WA-541]

■ స్టార్ హోంకేర్ సర్వీసు 24 గం॥ల పేషెంట్లు, పెద్దవారిని, చిన్నపిల్లలను ఇంటి వద్దనే చూసుకోవడానికి ఆడ/మగవారు కావలెను. భోజన సదుపాయం కలదు. 24 గం॥ డ్యూటీ. Cont 8977263124, 8897730132. [W-1002379]

■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [W-1221515]

■ Now Hiring Sales Staff, SRI Mahalaxmi Jewellers & Pearls, Jubilee Hills, Hyderabad. Join our Prestigious group for growth. Male Candidates only. Execullent pay. Ph: 9000703311, 9100112221, 9441436385. [HA-11739]

■ ప్రముఖ బ్యాంకులలో కం॥ఆపరేటర్స్ /క్లర్క్ / అటెండర్స్ / ఆఫీస్ అసిస్టెంట్స్ / అకౌంటెంట్స్/ క్యాషియర్స్. Q: 10th-PG, ఆకర్షణీయమైన జీతం. 9492881006 [G-7531]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నిద్రలోనే గుండెపోటుతో బాలింత మృతి

- ప్రసవించిన 5 రోజులకే ఘటన


సుష్మిత(ఫైల్)

వరంగల్ చౌరస్తా: వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలలో శుక్రవారం ఉదయం తెల్లవారుజామున గుండెపోటుతో బాలింత మృతి చెందింది. కుటుంబసభ్యులు, వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన బుస్స సుష్మిత (25) మొదటి కాన్పు ప్రసూతి వైద్యసేవల కోసం సీకేఎం హాస్పిటల్‌లో ఈనెల 13 చేరింది. అదే రోజు సిజేరియన్ ద్వారా మగశిశువుకు జన్మనిచ్చింది. శిశువు అనారోగ్యంగా ఉండడంతో నవజాత శిశువుల వార్డులోని ఇంక్యుబేటర్లో ఉంచి వైద్యసేవలు అందిస్తున్నారు. తల్లి సుష్మితను ఐసీయూనుంచి 18న ప్రత్యేక వార్డుకు మార్చారు. శుక్రవారం ఉదయం సుమారు 4:30 గంటల సమయంలో సుష్మిత వెళ్లి శిశువుకు పాలు పట్టించి వచ్చి నిద్రపోయింది. తిరిగి రెండు గంటల అనంతరం బాబుకు పాలుపట్టాలని తల్లి నిద్రలేపే ప్రయత్నం చేయగా కదలకపోవడంతో వైద్యులను సంప్రదించారు. డ్యూటీ వైద్యులు వెంటనే పరీక్షించి సీపీఆర్ నిర్వహించినప్పటికీ ఫలితం లేకపోయింది. నిద్రలో కార్డియాక్ అరెస్ట్ కావడంతో సుష్మిత మృతి చెందినట్లు సీకేఎం సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మలకుమారి తెలిపారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి ..


పరమేశ్వరచారి (ఫైల్)

వర్ధన్నపేట: ప్రమాదవశాత్తు హెచ్‌టీ విద్యుత్ లైన్ తీగలు తగిలి షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలో చోటుచేసుకుంది. వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన రామగిరి పరమేశ్వరచారి(60) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో తన ఇంటిలో విద్యుత్ మరమ్మతు పనులు చేయడంకోసం పట్టణానికి చెందిన బొంత సుధాకర్‌ను కోరాడు. తాను పట్టణంలోనే మరోచోట చంద్రకళ అనే మహిళ ఇంట్లో పనులు చేస్తున్నట్లు చెప్పాడు. దీంతో పరమేశ్వరచారి అక్కడకు వెళ్లి సుధాకర్‌తో మాట్లాడుతున్న క్రమంలో డాబా పైన ఉన్న హెచ్‌టీ లైన్ పీవీసీ పైపుతో ఉన్న విద్యుత్ తీగలకు తన చేయి తాకింది. దీంతో షాక్‌కు గురైన పరమేశ్వరచారిని కర్రతో కొట్టి సుధాకర్ తీగనుంచి వేరుచేశాడు. అనంతరం పరమేశ్వరచారి కుమారుడు శ్యాంప్రసాద్‌తో కలిసి వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే పరమేశ్వరచారి మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పరమేశ్వరచారికి భార్య భాగ్యలక్ష్మి, కుమారుడు శ్యాంప్రసాద్, కుమార్తెలు స్వాతి, సింధు ఉన్నారు. శ్యాంప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

హడక్ లోకోపైలెట్లు రెగ్యులరైజ్

- ఉత్తర్వులు జారీ చేసిన రైల్వే అధికారులు
- 381 మందికి పోస్టింగ్

కాజీపేట రూరల్: రైల్వే రన్నింగ్ స్టాఫ్ డిపార్ట్‌మెంట్‌లో హడక్ గూడ్స్ లోకోపైలెట్లుగా పని చేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేస్తూ సికింద్రాబాద్ రైల్వే అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ రన్నింగ్ బ్రాంచ్ వర్కింగ్ చైర్మన్ పాక రాజ్‌కుమార్ తెలిపారు. సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో 2019 నుంచి హడక్‌గా గూడ్స్ లోకోపైలెట్లు పని చేస్తున్నారని తెలిపారు. 2021లో రైల్వే జీఎంతో జరిగిన జీఎం పీఎన్ఎం మీటింగ్‌లో రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ జనరల్ సెక్రటరి రాఘవయ్య లోకోపైలెట్లను రెగ్యులరైజ్ చేయాలని ప్రస్తావించినట్లు గుర్తు చేశారు. దీంతో రైల్వే ఉన్నతాధికారులు పరిశీలించి నాలుగు సంవత్సరాల తర్వాత డివిజన్‌లో 381 మంది గూడ్స్ హడక్ లోకో పైలెట్లను రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. దీంతో కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని సనత్‌నగర్, బెల్లంపల్లి, రామగుండం, డోర్నకల్ జంక్షన్‌లో పని చేస్తున్న ఎక్కడి లోకోపైలెట్లకు అక్కడే పోస్టింగ్‌లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే సంఘ్ జనరల్ సెక్రటరి ఎం.రాఘవయ్య, సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరి డి.భుజంగరావు కృషితోనే హడక్ లోకోపైలెట్ల రెగ్యులరైజేషన్ జరిగిందని, ఇది సంఘ్ విజయంగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అరుణాచలానికి బస్సు సౌకర్యం

హన్మకొండ: తమిళనాడులోని అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తుందని వరంగల్ రీజినల్ మేనేజర్ జె.శ్రీలత తెలిపారు. అరుణాచల గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆమె ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 30న పౌర్ణమిని పురస్కరించుకుని సూపర్ లగ్జరీ బస్సును నడుపనున్నట్లు తెలిపారు. బస్సు ఈ నెల 29న మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ బస్ స్టేషన్‌లో బయలు దేరుతుందని, 30న ఉదయం కాణిపాకం, మధ్యాహ్నం 1 గంటకు వెల్లూరులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి దర్శనం అనంతరం సాయంత్రం 7 గంటలకు అరుణాచలానికి చేరుకుంటుందని వివరించారు. భక్తులు సర్వీస్ నంబర్ 92222 బస్సును ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. గిరి ప్రదక్షిణ అనంతరం 31న అరుణాచలం నుంచి బయలు దేరి జోగుళాంబ శక్తి పీఠం సన్నిధికి వెళ్తుందని, ఇక్కడ దర్శనానంతరం హనుమకొండకు బయలు దేరుతుందని వివరించారు. చార్జీ ఒక్కరికి రూ.4,500గా నిర్ణయించినట్లు తెలిపారు. టీఎస్ ఆర్టీసీ వెబ్ సైట్‌లో, సమీపంలోని ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్లలో రిజర్వేషన్ చేసుకోవచ్చని వివరించారు. ఈ టూర్ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి సమాచారం కోసం 99592 26047, 73828 55492 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పంట నష్టంతో రైతు ఆత్మహత్య


చక్రపాణి (ఫైల్)

టేకుమట్ల(రేగొండ): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వేసిన పంట వరదలో కొట్టుకుపోవడంతో మనస్తాపానికి గురైన ఓ రైతు ఆత్మహత్య పాల్పడ్డాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని కనిపర్తిలో శుక్రవారం చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనిపర్తికి చెందిన శ్రీపతి చక్రపాణి (63) తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో పత్తి పంటను సాగు చేయగా ఇటీవల కురిసిన భరీ వర్షాలకు పంట ధ్వంసమైంది. దీంతో పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చడం అని మనస్తాపానికి గురై ఈ నెల 16న గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు పరకాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ శుక్రవారం చక్రపాణి మృతి చెందాడు. మృతుడి భార్య భద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


నవీన్‌కుమార్(ఫైల్)

డోర్నకల్: మానుకోట జిల్లా డోర్నకల్ మండలంలోని లింబ్యాతండా శివారు లచ్చాతండాకు చెందిన యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డోర్నకల్ సీఐ ఉపేందర్ రావు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. లచ్చాతండాకు చెందిన బాదావత్ కృష్ణ, పద్మ దంపతుల కుమారుడు నవీన్‌కుమార్(24) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తల్లిదండ్రులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న నవీన్‌కుమార్ మూడు రోజుల క్రితం లచ్చాతండాకు వచ్చాడు. గురువారం ఉదయం పురుగుమందు తాగి అపస్మారకస్థితిలో ఉన్న నవీన్‌కుమార్‌ను కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రాత్రి మృతి చెందాడు. ప్రేమ విఫలం కావడంతో నవీన్‌కుమార్ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని సీఐ తెలిపారు. ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ నవీన్ తల్లిదండ్రులను పరామర్శించారు.

60ఏళ్లు దాటిన రైతులకు పింఛన్ ఇవ్వాలి

వరంగల్: జై జవాన్.. జై కిసాన్ అని నినాదమిచ్చే భారతదేశంలో అమరులైన, రిటైర్డ్ జవాన్ల కుటుంబాలను గౌరవిస్తున్న విధంగానే 60ఏళ్లు దాటిన రైతులందరికీ నెలకు రూ.10వేల చొప్పున పెన్షన్ ఇవ్వాలని, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగమిచ్చి గౌరవించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఏఐకేఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు మర్రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. వరంగల్ శివనగర్‌లోని సాయి కన్వెన్షన్ హాల్‌లో రైతు సదస్సు ముగింపు సమావేశంలో శుక్రవారం ఆయన పాల్గొని, మాట్లాడారు. రైతులకు పెన్షన్, పంటలకు గిట్టుబాటు ధరలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో రైతులు, సాగుదారులకు ఓటు హక్కు, రైతు కుటుంబాలకు ప్రభుత్వ, ప్రైవేట్ విద్య, ఉద్యోగ, వైద్య రంగాల్లో రిజర్వేషన్, వ్యవసాయ రంగానికి ఉపాధి పథకం అనుసంధానం, పసుపు పంటకు రూ.15వేలు, మిర్చికి రూ.30వేలు మద్దతు ధరలు, కౌలు, పోడు రైతులను గుర్తించాలని, రైతులకు రుణాలు మాఫీ చేసి వడ్డీలేని రుణాలు అందించాలని తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎఫ్ జాతీయ అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్, నాయకులు సింగతి సాంబయ్య, మోర్తాల చందర్‌రావు, నర్సయ్య, శంకర్‌రావు, ఆనందరావు, గోపాల్, కుమారస్వామి, తిరుపతి పాల్గొన్నారు.